ఆస్ట్రేలియన్లనూ అలరిస్తాం: రోహిత్‌శర్మ

పీఎం అల్బనీస్‌ను కలిసిన టీమ్‌ఇండియా క్రికెటర్లు

కాన్‌బెర్రా: భారత్, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలతో పాటు క్రికెట్ పట్ల అమితమైన ప్రేమ ఉందని టీమ్‌ఇండియా కెప్టెన్ రోహిత్‌శర్మ పేర్కొన్నాడు. ప్రైమ్ మినిస్టర్ లెవన్‌తో మ్యాచ్ కోసం కాన్‌బెర్రాకు చేరుకున్న భారత క్రికెట్ జట్టు గురువారం ఆస్ట్రేలియా ప్రధానమంత్రి అంథోనీ అల్బనీస్ ఇచ్చిన ప్రత్యేక విందుకు హాజరైంది. ఈ సందర్భంగా కెప్టెన్ రోహిత్‌శర్మ..టీమ్‌ఇండియా క్రికెటర్లను ఒక్కొక్కరిగా ప్రధానికి పరిచయం చేశాడు. ఆసీస్‌తో జరిగిన తొలి టెస్టులో అద్భుతంగా రాణించిన విరాట్‌కోహ్లీ, జస్‌ప్రీత్ బుమ్రాను అల్బనీస్ అభినందించారు. పార్లమెంట్‌ను ఉద్దేశించి కెప్టెన్ రోహిత్ మాట్లాడుతూ 'భారత్, ఆస్ట్రేలియా మధ్య ఎన్నో ఏండ్లుగా ద్వైపాక్షిక సంబంధాలు కొనసాగుతున్నాయి. క్రికెట్ అంటే ఇరు దేశాల వాసులకు ఎంతో అభిమానం. ఆసీస్‌లో సవాళ్లకు ఎదురొడ్డుతూ రాణించడం భారత ప్లేయర్లు ఇష్టపడుతారు. రెండు దేశాల అభిమానుల అలరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని అన్నాడు.

మెరిసిన భారత షట్లర్లు

- పోరాడి గెలిచిన సింధు

లక్నో: సయ్యద్ మోడీ ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీ రెండో రౌండ్‌లో భారత షట్లర్లు మెరిశారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు, ఉన్నతి హుడా, తస్నిమ్ మిర్, శ్రీయాన్షి.. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్, అయూశ్, లువాంగ్, రజావత్, రిత్విక్ ఈ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. మహిళల సింగిల్స్‌లో 18వ ర్యాంకర్ సింధు 21-10, 12-21, 21-15తో భారత్‌కే చెందిన ఇరా శర్మపై పోరాడి గెలిచింది. మరో పోరులో 17 ఏండ్ల యువ సంచలనం ఉన్నతి 21-18, 22-20తో చోయికీవాంగ్‌ను ఓడించింది. మాళవిక బన్సోద్, అనుపమ పోరాటం ప్రిక్వార్టర్స్‌లోనే ముగిసింది. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 21-14, 21-13తో డానిల్‌పై అలవోకగా గెలిచాడు. రజావత్ 21-15, 21-8తో లి డుక్ ఫట్‌పై గెలిచాడు. మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ - గాయత్రి గోపీచంద్ ద్వయం 21-13, 21-10తో అశ్విని-శిఖాను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమిత్‌రెడ్డి-సిక్కిరెడ్డి జంట.. 18-21, 12-21తో లూ బింగ్ - హో లొ చేతిలో పరాభవం పాలైంది.

చేజారిన విలియమ్సన్ శతకం

- న్యూజిలాండ్ 319/8

క్రైస్ట్‌చర్చ్: భారత్‌పై చరిత్రాత్మక టెస్టు సిరీస్ విజయం అనంతరం సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మొదటి రోజు న్యూజిలాండ్ నిలకడగా ఆడింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు 83 ఓవర్లకు 8 వికెట్లు నష్టపోయి 319 పరుగుల స్కోరుచేసింది. మాజీ సారథి కేన్ విలియమ్సన్ (93) తృటిలో శతకం చేజార్చుకోగా కెప్టెన్ టామ్ లాథమ్ (47), గ్లెన్ ఫిలిప్స్ (41 నాటౌట్) రాణించారు. ఒకదశలో 198/3గా పటిష్టంగా కనిపించిన కివీస్.. ఇంగ్లీష్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/69) ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది.

హైదరాబాద్‌లో ఖేలోఇండియా గేమ్స్

- 2026లో నిర్వహణకు కేంద్రం సుముఖం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా-2026 పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు కేంద్ర క్రీడాశాఖ సుముఖత వ్యక్తం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన పలు ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్నది. ఇప్పటికే ఖేలో ఇండియా-2025కు బీహార్ ఆతిథ్యం ఖరారు కాగా, 2026లో తెలంగాణకు అవకాశమిచ్చేందుకు క్రీడా మంత్రి మన్సుఖ్ మాండవీయా సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా స్టేడియాల్లో సౌకర్యాలు ఉన్నాయని ప్రభుత్వం తమ ప్రతిపాదనల్లో తెలిపింది.

స్వియాటెక్‌పై ఒక నెల నిషేధం

లండన్: నిషేధిత ఉత్ప్రేరకాలు వాడినందుకు గాను ఐదుసార్లు గ్రాండ్ స్లామ్ చాంపియన్, ప్రపంచ నంబర్ వన్ ఇగా స్వియాటెక్‌పై ఒక నెల నిషేధం పడింది. ఈ మేరకు ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ (ఐటీఐఏ) ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ ఏడాది ఆగస్టులో నిర్వహించిన డోప్ పరీక్షలో పోలండ్ భామ పాజిటివ్‌గా తేలింది. స్వియాటెక్ తన తప్పును ఒప్పుకోవడంతో ఆమెపై నామమాత్రపు శిక్షగా నెల రోజుల నిషేధాన్ని విధించినట్టు ఐటీఐఏ తెలిపింది.

టైటాన్స్ సూపర్

గ్రేటర్ నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ అదరగొడుతున్నది. గురువారం జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 41-35తోయూ ముంబాపై అద్భుత విజయం సాధించింది. మ్యాచ్ ఆసాంతం తమదైన ఆధిపత్యం ప్రదర్శించిన టైటాన్స్ తరపున విజయ్ మాలిక్ (10), అశీష్ నర్వాల్ (10) సూపర్ టెన్‌షో చేయగా, డిఫెండర్ సాగర్ (5) హైఫైవ్‌తో ఆకట్టుకున్నాడు. ప్రథమార్ధంలో 25-13తో ఆధిక్యం కొనసాగించిన టైటాన్స్.. ద్వితీయార్ధంలోనూ అదే జోరు ప్రదర్శించింది.

హైబ్రిడ్‌కు నో

మొండిపట్టు వీడని పాకిస్థాన్ • భారత్ రాకుంటే టోర్నీలన్నీ బహిష్కరిస్తామని హెచ్చరిక

నేడు తేలనున్న చాంపియన్స్ ట్రోఫీ భవితవ్యం

కరాచీ: పాకిస్థాన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించతలపెట్టిన ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆ దేశంలో జరుగుతుందా? ప్రస్తుతం ప్రపంచ క్రికెట్‌లో సర్వత్రా ఇదే చర్చ నడుస్తోంది. భద్రతా కారణాల రీత్యా దాయాది దేశానికి వెళ్లబోమని, హైబ్రిడ్ మోడల్ అయితేనే ఆడతామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇది వరకే తన నిర్ణయాన్ని స్పష్టం చేయగా మరోవైపు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అందుకు ససేమిరా అంగీకరించడం లేదు. టీమ్‌ఇండియా పాక్‌కు రావాల్సిందేనని పట్టుబడుతోంది. శుక్రవారం జరగాల్సి ఉన్న ఐసీసీ వర్చువల్ సమావేశానికి కొద్దిగంటల ముందు కూడా పీసీబీ అదే మొండి పట్టుదలను ప్రదర్శిస్తూ.. 'హైబ్రిడ్ మోడల్‌ను అంగీకరించే ప్రసక్తే లేదు. దీనిపై మేం ఇది వరకే ఐసీసీకి మా నిర్ణయాన్ని తేల్చి చెప్పాం' అని బోర్డు ప్రతినిధి ఒకరు చెప్పారు. ఈ నేపథ్యంలో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ షెడ్యూల్ విడుదలపై జరగాల్సిన చర్చ కాస్తా అసలు ఈ టోర్నీ పాకిస్థాన్‌లో ఉంటుందా? మరో దేశానికి తరలిపోతుందా? అలా చేస్తే పాకిస్థాన్ ఊరుకుంటుందా? భారత్ కోరుకున్నట్టుగా హైబ్రిడ్ మోడల్ సాధ్యమవుతుందా? అన్న అంశాలపై సాగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

టోర్నీని తరలిస్తారా?

పాక్‌కు రాబోమని విముఖత వ్యక్తం చేసినా టీమ్‌ఇండియా తమ దేశానికి రావాల్సిందేనన్న మంకు పట్టుతో ఉన్న పీసీబీకి గత వారం రోజులుగా పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో తలెత్తిన పరిస్థితి కొత్త తలనొప్పిని తెచ్చిపెడుతోంది. ఆ దేశ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన పార్టీ మద్దతుదారులు సృష్టిస్తున్న హింసాకాండకు అక్కడ సుమారు ఆరుగురు భద్రతా సిబ్బంది మరణించగా వందలాదిగా జనం గాయాల పాలయ్యారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పాక్ ప్రభుత్వం ఇస్లామాబాద్‌ను అష్టదిగ్బంధం చేసి ఆందోళనకారులు హింసాత్మక ఘటనలకు పాల్పడితే కాల్చి చంపాలని ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా పాక్ పర్యటనలో ఉన్న శ్రీలంక - ఏ జట్టు తమ ఈ అల్లర్ల నేపథ్యంలో తమ ఆటగాళ్లను వెనక్కి పిలిచింది. ఇది పీసీబీకి గట్టి ఎదురుదెబ్బే. ఇదే కారణాన్ని చూపుతూ మరికొన్ని దేశాల బోర్డులు తమ ఆటగాళ్లను పాక్‌కు పంపడానికి ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అసలు పాకిస్థాన్‌లో చాంపియన్స్ ట్రోఫీ ఉంటుందా? అనేది అనుమానంగా మారింది. ఒకవేళ టోర్నీ మొత్తం రద్దు చేయాలని భావిస్తే తాము చాంపియన్స్ ట్రోఫీని ఎక్కడ నిర్వహించినా పాల్గొనేది లేదని పీసీబీ ఇప్పటికే బెదిరింపులకు దిగిన నేపథ్యంలో శుక్రవారం సమావేశంలో ఐసీసీ ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరం.

అలా అయితే భారత్‌కు వెళ్లం!

చాంపియన్స్ ట్రోఫీ ఆడేందుకు భారత్ తమ దేశానికి రాకుంటే తామూ ఇకపై ఆ దేశంలో జరిగే ఐసీసీ ఈవెంట్లకు వెళ్లేది లేదని పీసీబీ చీఫ్ మోహ్సిన్ నఖ్వీ గురువారం తెలిపాడు. 'భారత్‌లో జరిగే ఐసీసీ టోర్నీలు ఆడేందుకు మేం వెళ్తున్నాం. కానీ వాళ్లు ఇక్కడకు రాకపోవడం ఆమోదయోగ్యం కాదు. ఒకవేళ భారత్ అదే పద్ధతిని కొనసాగిస్తే భవిష్యత్‌లో భారత్‌లో జరిగే టోర్నీలకు మేమూ జట్టును పంపబోమ'ని స్పష్టం చేశాడు. డిసెంబర్ 1 నుంచి ఐసీసీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్న జై షా.. బీసీసీఐ సెక్రటరీగా కాకుండా ప్రపంచ క్రికెట్ ప్రయోజనాల కోసం పనిచేయాలని తాము ఆశిస్తున్నట్టు చెప్పాడు.

లంక 42 ఆలౌట్

జాన్సెన్ ధాటికి విలవిల

తొలి టెస్టులో పట్టు బిగించిన సఫారీలు

డర్బన్: స్వదేశంలో శ్రీలంకతో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా పేసర్ మార్కో జాన్సెన్ (7/13) బెంబేలెత్తించడంతో లంకేయులు విలవిల్లాడారు. జాన్సెన్‌తో పాటు గెరాల్డ్ కొయెట్జీ (2/18) ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో లంక 13.5 ఓవర్లలో 42 పరుగులకే ఆలౌట్ అయింది. టెస్టులలో ఇది వారికి అత్యల్ప స్కోరు (అంతకుముందు పాక్‌పై 71). జాన్సెన్ 6.5 ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసి 13 పరుగులే ఇవ్వగా ఓ మెయిడిన్‌తో పాటు 7 వికెట్లు తీసి లంకను కోలుకోలేని దెబ్బ కొట్టాడు. టెస్టులలో అతడికిదే అత్యుత్తమ ప్రదర్శన. జాన్సెన్ ధాటికి శ్రీలంక బ్యాటర్లలో ఏకంగా ఐదుగురు డకౌట్ అవగా మరో నలుగురు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. కమిందు మెండిస్ (13), లాహిరు కుమార (10) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. తొలి ఇన్నింగ్స్‌లో సఫారీలకు 149 పరుగుల ఆధిక్యం దక్కగా రెండో ఇన్నింగ్స్‌లో 40 ఓవర్లలో 130/3 పరుగులు చేశారు.

నిత్య, శివాని పసిడి వెలుగులు

- జాతీయ స్విమ్మింగ్ టోర్నీ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాజ్‌కోట్(గుజరాత్) వేదికగా జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్ల పతక హవా దిగ్విజయంగా కొనసాగుతున్నది. గురువారం జరిగిన బాలికల అండర్-14 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో రాష్ట్ర యువ స్విమ్మర్ శివానీ కర్రా 2:33:36సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. శ్రేయా(సీఐఎస్‌సీఈ), దయానీ పటేల్(గుజరాత్) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు బాలికల అండర్-17 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ కేటగిరిలో నిత్య సాగి(2:27:95సె) పసిడి దక్కించుకోగా, మీనాక్షి (సీఐఎస్‌సీఈ), సాగ్నిక (పశ్చిమ బెంగాల్) రజత, కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

వందింతలయ్యే నా అందం

పాటల చిత్రీకరణలో దర్శకుడు శంకర్‌ది ఓ ప్రత్యేకశైలి. ఆయన తొలి సినిమా 'జెంటిల్‌మేన్' నుంచి ప్రతి సినిమాలోని పాటలు గ్రాండియర్‌గా విజువల్ ఫీస్ట్‌గా అనిపిస్తాయి. ప్రస్తుతం ఆయన రామ్‌చరణ్ హీరోగా 'గేమ్ చేంజర్' సినిమా తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా నుంచి ఇప్పటికే రెండు పాటలు విడుదల చేశారు. గురువారం ఈ సినిమా నుంచి మూడో పాట విడుదలైంది. 'నా నా హైరానా.. ప్రియమైనా హైరానా.. ' అంటూ సాగే ఈ పాటను రామజోగయ్యశాస్త్రి రాయగా, థమన్ స్వరపరిచారు. శ్రేయా ఘోషల్, కార్తీక్ ఆలపించారు. 'వందితలయ్యే నా అందం నువ్వు నా పక్కన ఉంటే..వజ్రంలా మెరిశా ఇంకొంచెం నువ్వు నా పక్కన ఉంటే' వంటి చరణాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. రామ్‌చరణ్, కైరా అద్వానీ స్క్రీన్ కెమెస్ట్రీ ఈ పాటలో అద్భుతంగా ఉంటుందని, శంకర్ తనదైన శైలిలో కలర్‌ఫుల్‌గా, గ్రాండియర్‌గా ఈ పాటను మలిచారని, న్యూజిలాండ్‌లో రెడ్ ఇన్‌ఫ్రా కెమెరాతో ఈ పాటను షూట్ చేయడం జరిగిందని, ఇది ఇండియాలో ఇప్పటివరకూ జరగని ప్రక్రియ అని, ఈ పాట ఓ పెయింటింగ్‌లా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. శ్రీకాంత్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు ఇతర పాత్రధారులు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకాలపై దిల్‌రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

వెయ్యికోట్ల బడ్జెట్.. 50 భాషల్లో విడుదల

ఇండియన్ సినిమా హిస్టరీలో జాతి గర్వించదగ్గ మహాదర్శకుడుండొచ్చు. కానీ.. ప్రపంచ సినీ వేదికపై సముచితస్థానాన్ని దక్కించుకున్న భారతీయ సినీదర్శకుడు మాత్రం ఒక్క ఎస్.ఎస్.రాజమౌళి మాత్రమే అని చెప్పడం ఏ మాత్రం అతిశయోక్తికాదు. అందుకే ఆయన సినిమా ఓపెనింగ్‌కి ప్రపంచ ప్రఖ్యాత దర్శకులు జేమ్స్ కామెరూన్, స్టీవెన్ స్పీల్‌బర్గ్ రానున్నారని తెలుస్తున్నది. ఇదే నిజమైతే.. అవి భారతీయ సినిమా సగర్వంగా తలెత్తుకునే క్షణాలవుతాయి. మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో కె.ఎల్.నారాయణ నిర్మించే ఈ పాన్ వరల్డ్ మూవీ 2025 జనవరిలో ప్రారంభం కానున్నదనేది లేటెస్ట్ న్యూస్. ఈ వేడుకకు జేమ్స్ కామెరూన్, స్టీవెల్ స్పీల్‌బర్గ్ అతిథులుగా రానున్నారని సమాచారం. ఈ ఫ్రాంచైజీని వెయ్యికోట్ల బడ్జెట్‌తో నిర్మించనున్నట్టు సమాచారం. 50 భాషల్లో ఈ సినిమా విడుదల కానుంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ట్రజర్ హంట్ కథాంశమని టాక్. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

500మంది ఫైటర్లతో..



పవన్‌కల్యాణ్ కెరీర్‌లోనే తొలి పీరియాడియల్ యాక్షన్ అడ్వెంచర్ 'హరిహర వీరమల్లు'. 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' అనేది ఉపశీర్షిక. క్రిష్ దర్శకత్వంలో కొంత భాగం చిత్రీకరణ జరుపుకున్న ఈ సినిమాకు ప్రస్తుత దర్శకుడు జ్యోతికృష్ణ. ఇటీవలే భారీ యాక్షన్ సన్నివేశాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆయన తెరకెక్కించారు. హాలీవుడ్ యాక్షన్ దర్శకుడు నిక్ పావెల్ నేతృత్వంలో ఈ యుద్ధ సన్నివేశాల చిత్రీకరణ జరిగింది. పవన్‌కల్యాణ్‌తోపాటు 500మంది ఫైటర్లు పాల్గొన్న ఈ భారీ యుద్ధ సన్నివేశం అద్భుతంగా వచ్చిందని చిత్రబృందం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వారాంతం విజయవాడలో ఆఖరి షెడ్యూల్ మొదలుకానున్నదని, పవన్‌కల్యాణ్‌తోపాటు రెండొందలమంది ఆర్టిస్టులు ఈ షెడ్యూల్‌లో పాల్గొనబోతున్నారని, అత్యంత కీలకమైన భారీ సన్నివేశాల చిత్రీకరణ ఈ షెడ్యూల్‌లో ఉంటుందని, దీంతో 'హరిహర వీరమల్లు' షూటింగ్ కంప్లీట్ అవుతుందని మేకర్స్ తెలిపారు. వచ్చే ఏడాది మార్చి 28న పాన్ ఇండియా స్థాయిలో సినిమా విడుదల కానుంది. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనుపమ్‌ఖేర్, నాజర్, రఘుబాబు తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాత: ఎ.దయాకర్‌రావు, సమర్పణ: ఏ.ఎం.రత్నం, నిర్మాణం: శ్రీసూర్య మూవీస్.

ఆ బాధలోంచే ఈ కథ పుట్టింది

'దర్శకుడు సుబ్బు మూడేళ్లు కేవలం ఈ సినిమాతోనే జర్నీ చేశారు. అదినాకు చాలా నచ్చింది. కథ ఎంత అద్భుతంగా చెప్పారో, అంతకంటే అద్భుతంగా తీశారు. టెక్నీషియన్స్ అందరూ ప్రాణం పెట్టి పనిచేశారు. అందరం కలిసి ఓ టీమ్ ఎఫర్ట్‌గా పనిచేశాం. నా కెరీర్‌లో 'నాంది'లా ఈ సినిమా కూడా ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతుంది' అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన హీరోగా సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'బచ్చలమల్లి'. రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మాతలు. ఈ సినిమా టీజర్‌ని గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్లరి నరేశ్ మాట్లాడారు. 'కరోనా టైమ్‌లో అమ్మను చూడ్డానికి హాస్పిటల్‌కి సరైన సమయంలో వెళ్లలేకపోయా. తీరా వెళ్లే సరికి అదే చివరి చూపు అయ్యింది. జీవితాన్ని తేలిగ్గా తీసుకోకూడదని అప్పుడర్థమైంది. వెనక్కి వెళ్లి సరిదిద్దుకోలేని తప్పు చేయకూడదని అప్పుడు తెలిసింది. ఇలాంటి పాయింట్‌తో నిజాయితీగా ఓ కథ చెప్పాలనిపించింది. అదే ఈ 'బచ్చలమల్లి'' అని దర్శకుడు చెప్పారు. 'ఇష్టంతో కష్టపడి, ప్రేమించి చేసిన సినిమా ఇది. డిసెంబర్ 20న వస్తున్నాం. హిట్ కొడుతున్నాం.. రాసిపెట్టుకోండి' అని నిర్మాత రాజేష్ దండా నమ్మకంగా చెప్పారు. ఇంకా కథానాయిక అమృతా అయ్యర్, నటుడు ప్రసాద్ బెహరా, డీవోపీ రిచర్డ్, ఎడిటర్ చోటా కె.ప్రసాద్, కళాదర్శకుడు బ్రహ్మకడలి కూడా మాట్లాడారు.

నవ్వించే ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. 'చంటబ్బాయి గారి తాలూకా' ఉపశీర్షిక. మోహన్ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి వెన్నపూస రమణా రెడ్డి నిర్మాత. డిసెంబర్ 25న విడుదల కానుంది. గురువారం టీజర్‌ను విడుదల చేశారు. పోలీస్ అధికారి తాను పరిష్కరించాల్సిన ఓ క్రిమినల్ కేసును శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ పేరుతో డిటెక్టివ్ ఏజెన్సీ నడుపుతున్న వెన్నెల కిషోర్‌కు అప్పగించడం, కేసు విచారణలో ఆయన పండించిన హాస్యంతో టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమా హక్కులను వంశీ నందిపాటి తీసుకోవడంతో మాకు ధైర్యం వచ్చింది. సినిమాలపై ఆయన జడ్జిమెంట్ చాలా బాగుంటుంది. కామెడీ కలబోసిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ అయిన ఈ సినిమా అందరిని మెప్పిస్తుంది' అన్నారు. ఇదొక ఫుల్‌మీల్స్‌లాంటి సినిమా అని కథానాయిక అనన్య నాగళ్ల పేర్కొంది. ఈ సినిమా చూస్తూ ఆద్యంతం మెస్మరైజ్ అయ్యానని నిర్మాత వంశీ నందిపాటి తెలిపారు. సీయాగౌతమ్, స్నేహ గుప్తా, రవితేజ మహద్యం, బాహుబలి ప్రభాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్‌కశ్యప్, రచన, దర్శకత్వం: రైటర్ మోహన్.

అలా మొదలైంది మా ప్రేమకథ

సినీ నటులు నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల డిసెంబర్ 4న వివాహం చేసుకోబోతున్న విషయం తెలిసిందే. ప్రతిష్టాత్మక అన్నపూర్ణ స్టూడియో వీరి పెళ్లికి వేదిక కానుంది. తమ రిలేషన్‌షిప్‌పై గత ఏడాది కాలంగా గోప్యత పాటించిన ఈ జంట ఆగస్ట్‌లో నిశ్చితార్థం జరుపుకొని అభిమానులకు స్వీట్ సర్‌ప్రైజ్‌ని చ్చారు. అప్పుడే వీరి లవ్ ఎఫైర్ గురించి అందరికి తెలిసింది. ఇదిలా వుండగా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో శోభితా ధూళిపాళ్లతో తన పరిచయం, ఆమె కుటుంబ సభ్యులతో ఏర్పడిన అనుబంధం గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు నాగచైతన్య. ముంబయిలో జరిగిన ఒక ఓటీటీ షో సందర్భంగా తామిద్దరం తొలిసారిగా కలుసుకున్నామని చైతూ తెలిపారు. ఆయన మాట్లాడుతూ 'మా ఇద్దరి పరిచయం అనుకోకుండా జరిగిపోయింది. ఫస్ట్ మీటింగ్‌లో చాలా సరదాగా మాట్లాడుకున్నాం. కొన్ని నెలల వ్యవధిలోనే మా మధ్య బంధం బలపడింది. ఆ తర్వాత మా ఇద్దరి ఫ్యామిలీస్ చాలా సార్లు కలిశాయి' అని చెప్పారు నాగచైతన్య. శోభితా కుటుంబం సంప్రదాయాలకు చాలా ప్రాధాన్యతనిస్తుందని, తనను వారు ఓ కొడుకులా ట్రీట్ చేస్తారని నాగచైతన్య చెప్పారు. అన్నపూర్ణ స్టూడియోతో తమ కుటుంబానికి భావోద్వేభరితమైన అనుబంధం ఉందని, అక్కడ పెళ్లి చేసుకోవడం చాలా ప్రత్యేకంగా భావిస్తున్నానని నాగచైతన్య తెలిపారు.

నాగశౌర్య ఇంటెన్స్ యాక్షన్

యువ హీరో నాగశౌర్య ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. కొత్త దర్శకుడు రామ్ దేశిన డైరెక్షన్‌లో నాగశౌర్య ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్న విషయం తెలిసిందే. శ్రీవైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. నాగశౌర్య పాల్గొనగా యాక్షన్ ఘట్టాలను తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే అరవైశాతం చిత్రీకరణ పూర్తయిందని, హై ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇదని, నాగశౌర్య పాత్ర గతంలో చూడని విధంగా పవర్‌ఫుల్‌గా ఉంటుందని మేకర్స్ తెలిపారు.

కోర్ట్‌రూమ్ డ్రామా 'ఉద్వేగం'

'ఉద్వేగం' చిత్రం కోర్ట్‌రూమ్ డ్రామాగా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని, ఇప్పటివరకు చర్చించని సరికొత్త పాయింట్‌తో ఈ సినిమాను తెరకెక్కించామని చెప్పారు దర్శకుడు మహిపాల్ రెడ్డి. త్రిగుణ్ హీరోగా నటించిన 'ఉద్వేగం' చిత్రం నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి గురువారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడుతూ 'ఇదొక కోర్ట్‌రూమ్ డ్రామా. గ్యాంగ్‌రేప్ నేపథ్యంలో కథ నడుస్తుంది. ఆ కేసులో నిందితుడిగా ఉన్న ఓ యువకుడి తరపున లాయర్ అయిన హీరో వాదిస్తుంటాడు. అమ్మాయి తరపున మరో లాయర్ కేసును టేకాఫ్ చేస్తాడు. కేసును వాదించే క్రమంలో ఇద్దరు లాయర్ల మధ్య సంఘర్షణ ఆసక్తిని కలిగిస్తుంది. చివరకు ఇద్దరూ కేసులో గెలవడమే ఈ సినిమాలో ఇంట్రెస్టింగ్ పాయింట్. అదేమిటో సినిమా చూసి తెలుసుకోవాల్సిందే' అని చెప్పారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.